ఆంధ్రజ్యోతి ది: 17.5.2013

# మన మెట్రో ఇంజనీరింగ్ అద్భుతం



- ప్రపంచంలోనే అత్యుత్తమ ప్రాజెక్ట్
- గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీడర్‌షిప్ ఫోరం అవార్డు
- గ్లోబల్ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ ఆఫ్ ద ఇయర్-2013గా గుర్తింపు
- హైదరాబాద్ మెట్రోరైల్ లిమిటెడ్‌కు సర్వత్రా ప్రశంసలు

హైదరాబాద్, మే 16(ఆంధ్రజ్యోతి సిటీబ్యూరో): అలుపన్నది తెలియకుండా నిర్విరామంగా పనిచేసే యంత్రాలు.. వాటి వేగంతో పోటీ పడుతూ చకచకా పరుగులు తీసే సుశిక్షితులైన ఉద్యోగులు, వేల టన్నుల ఇనుము, లక్షల బస్తాల సిమెంటు, వందల మంది ప్రణాళికాబద్ధమైన శ్రమ... ఇవన్నీ కలిస్తే హైదరాబాద్ మెట్రోరైలు. మియాపూర్, కూకట్‌పల్లి నుంచి దిల్‌సుఖ్‌నగర్, వనస్థలిపురం లాంటి చోట్లకు వెళ్లాలంటే ట్రాఫిక్ భూతాన్ని దాటుకుంటూ సర్కస్ ఫీట్లన్నీ చేస్తూ టన్నులకొద్దీ కాలుష్యాన్ని మింగుతూ ఓ రెండు గంటలు అష్టకష్టాలు పడాల్సిందే. ప్రస్తుతం ఇదీ నగరంలో ట్రాఫిక్ పరిస్థితి. కానీ రెండు సంవత్సరాలు ఆగితే.. ఇలా మియాపూర్‌లో మెట్రోరైలు ఎక్కగానే.. అలా ఎల్‌బీనగర్‌లో దిగొచ్చు. ట్రాఫిక్ కష్టాలకు చెక్ పడుతుంది. ప్రయాణానికి పట్టే సమయం నాలుగోవంతుకు తగ్గుతుంది. ఒళ్లు హూనం చేసే గుంతలు, స్పీడ్‌బ్రేకర్ల బాధలూ తప్పుతాయి. జంటనగరాల వాసులకు అత్యున్నత సేవలందించేందుకు శరవేగంగా సిద్ధమవుతున్న మన మెట్రోరైలుకు ఇప్పుడు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. ప్రపంచంలో ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు సిద్ధమవుతున్న వంద మౌలిక వసతుల ప్రాజెక్టులను తీసుకుంటే.. వాటిలో అత్యుత్తమ ఇంజనీరింగ్ ప్రాజెక్టుగా మన హైదరాబాద్ మెట్రోరైల్ ప్రాజెక్టు నిలిచింది! అవును.. ఎల్అండ్‌టీ చేపట్టిన హైదరాబాద్ మెట్రోప్రాజక్టు ప్రపంచంలో నెంబర్ వన్ అన్నమాట!!

## గ్లోబల్ అవార్డు..

అమెరికాలోని న్యూయార్క్‌లో ఇటీవలే ప్రపంచ మౌలికవసతుల నాయకత్వ సదస్సు(గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీడర్‌షిప్ ఫోరం) జరిగింది. రూ. 14,132 కోట్లతో రూపొందుతున్న మన హైదరాబాద్ మెట్రోరైలు ప్రాజెక్టును గ్లోబల్ ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ ఆఫ్ ద ఇయర్-2013గా ఈ సదస్సు గుర్తించింది. ప్రజాస్వామ్య దేశాల్లో మౌలిక వసతుల కల్పనకు పెట్టుబడులు అంతగా ఉండట్లేదని, దానివల్ల ఆయా దేశాలు దీర్ఘకాలంలో నష్టపోతున్నాయనే ఉద్దేశంతో మౌలిక రంగ ప్రణాళికల్లో ముందున్న అనేక దేశాలు కలిసి ఆరేళ్ల క్రితం ఈ ఫోరాన్ని ఏర్పాటుచేశాయి. దీని వార్షిక సమావేశం జరగడానికి ముందు ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాల్లో జరుగుతున్న మౌలిక వసతుల నిర్మాణాలను పరిశీలించి, వాటిని అధ్యయనం చేస్తారు. ఆయా ప్రాంతాల, దేశాల ఆర్థికాభివృద్ధికి, ఉత్పాదకతకు, ఉద్యోగావకాశాలకు, ఇంధన సామర్థ్యానికి, కాలుష్య నివారణకు ఆయా ప్రాజెక్టులు ఎలా దోహదం చేస్తాయో గమనించి ముందుగా వాటిలోంచి వంద ప్రాజెక్టులను ఎంపికచేస్తారు. వీటిని 'స్ట్రాటజిక్ 100' అంటారు.

## ఎంపిక ఇలా..

ముందుగా గుర్తించిన స్ట్రాటజిక్ 100లోని ప్రతి ప్రాజెక్టు గురించి దాని ప్రతినిధులు వార్షిక సమావేశంలో పదేసి నిమిషాల చొప్పున వివరించాలి. ఈ పది నిమి



షాల్లోనే ప్రాజెక్టుకు సంబంధించిన, దేశానికి సంబంధించిన వివరాలన్నింటినీ క్లుప్తంగా, సమర్థంగా చెప్పాల్సి ఉంటుంది. తర్వాత ఐదు నిమిషాల పాటు దానిపై చర్చ ఉంటుంది. ఆపై వివిధ దేశాల ప్రతినిధులు ఆ ప్రాజెక్టు గురించి వేసే ప్రశ్నలకు సమాధానాలిచ్చి, వారి సందేహాలన్నింటినీ తీర్చాలి. మూడు రోజుల్లో వంద ప్రాజెక్టుల వివరాలను ఉదయం నుంచి రాత్రి వరకు తీసుకుంటారు. తర్వాత వాటి ఆధారంగా ఐదు విభాగాల్లో ప్రపంచంలో అత్యుత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేస్తారు. అందులోనూ మళ్లీ ప్రతి విభాగంలో మూడేసి ప్రాజెక్టులను పరిశీలించి.. వాటిలో ఒక్క దాన్నే అవార్డుకు ఎంపిక చేస్తారు. ఈసారి కూడా ఇలాగే ఐదు దేశాలకు చెందిన వివిధ ప్రాజెక్టులు వివిధ విభాగాల్లో అవార్డులకు ఎంపికయ్యాయి. అత్యుత్తమ ఇంజనీరింగ్ ప్రాజెక్టు విభాగంలో మూడు ప్రాజెక్టులు పోటీపడ్డాయి. అజర్‌బైజాన్‌కు చెందిన ట్రాన్స్ అనటోలియన్ గ్యాస్ పైప్‌లైన్ (రూ.37,800 కోట్లు), భారత్‌లోని హైదరాబాద్ మెట్రోరైల్ (రూ.14, 132 కోట్లు), కువైట్‌లోని అల్ అబ్దాలియా సోలార్‌ప్రాజెక్టులు పోటీ పడగా మనదే బెస్ట్ అని అంతర్జాతీయ ప్రతినిధులందరూ ముక్తకంఠంతో తేల్చిచెప్పారు. దీంతో ఒక్కసారిగా కరతాళ ధ్వనులు మిన్నంటాయి.

## ఎందుకు బెస్ట్?

ప్రపంచవ్యాప్తంగా అనేక మౌలిక వసతుల ప్రాజెక్టులను ఏర్పాటు చేస్తున్నా, మన ప్రాజెక్ట్ అన్నింటికంటే ఎలా భిన్నమైనదనే అంశాన్ని మెట్రోరైల్ ఎండీ ఎన్.వి.ఎస్. రెడ్డి అంతకుముందు తన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. దీన్ని కేవలం ఒక రవాణా ప్రాజెక్టుగానే కాక.. నగర పునర్నిర్మాణ(అర్బన్ రీడిజైన్) ప్రాజెక్టుగా ఆయన అభివర్ణించారు. రైల్వేస్టేషన్లు, బస్ డిపోలు, లోకల్ రైళ్లతో మెట్రోను అనుసంధానం చేయడం, స్కైవాక్‌లు, పుట్‌పాత్‌ల ఏర్పాటు ద్వారా ప్రయాణికులకు సౌకర్యవంతం చేయడం, మెట్రో స్టేషన్లలో బైక్ స్టేషన్ల ఏర్పాటు, సైకిల్ ట్రాక్‌లు, హరిత మెట్రో స్టేషన్లు, ఇంధన వినియోగాన్ని గణనీయంగా తగ్గించడం... తదితర వివరాలను, ప్రయోజనాలను ఆయన తెలిపారు. దీంతో మెట్రో ప్రణాళికా విధానాన్ని, ఆర్థిక, ఇంజనీరింగ్ ఆవిష్కరణలను న్యూయార్క్ మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్టేషన్ అథారిటీ అధ్యక్షురాలు నూరియా ఫెర్నాండెజ్ అభినందించారు. అమెరికా కూడా ఇలాంటి విధానాలను అనుసరించాలని ఆమె సూచించారు.